సాక్షి చిత్తూరు

బుధవారం । 24 । జనవరి । 2024



అతివల ఆర్థికాభివృద్ధికి 'ఆసరా'
మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకే ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేస్తోందని ఎంపీ తెలిపారు. - 10లో



ప్రభుత్వ బళ్లు.. సౌకర్యాల పొదరిళ్లు
నాడు నేడు పథకం కింద సర్కారు బడుల్లో ఆధునిక వసతులు అందుబాటులోకి వచ్చాయి. - 10లో



అభివృద్ధి బడ్జెట్ రూ.4,732 కోట్లు
చిత్తూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. - 10లో

న్యూస్‌రీల్

జగనన్న చలువతోనే కృష్ణా జలాలు



హంద్రీ-నీవా కాలువ వద్ద జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువతోనే కృష్ణాజలాలు వచ్చాయని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని జవ్వనపల్లె క్రాస్ వద్ద హంద్రీ-నీవా కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలను ఆయన పరిశీలించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ వి.కోట, కుప్పం ప్రాంతాల రైతులు ఎక్కువ వాణిజ్య పంటలు సాగు చేస్తుంటారన్నారు. భూగర్భజలాలు అడుగంటడంతో వ్యవసాయం కష్టంగా మారిన పరిస్థితుల్లో కృష్ణా జలాలు రావడం అదృష్టంగా భావిస్తున్నారని వెల్లడించారు. మాట ఇస్తే నెరవేరుస్తారని మరోసారి జగనన్న నిరూపించుకున్నారని కొనియాడారు.

ఏఎంసీ పన్ను వసూళ్లలో పలమనేరు టాప్



సంజీవ్‌కుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న రామాంజనేయులు

పలమనేరు : ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా పన్ను వసూళ్లలో పలమనేరు వ్యవసాయమార్కెట్ కమిటీ అగ్రస్థానం దక్కించుకుంది. మొత్తం 23 ఏఎంసీలకు గాను రూ.2.75కోట్లతో పలమనేరు ముందంజలో ఉంది. మార్చి 31వ తేదీలోపు పూర్తి చేయాల్సిన లక్ష్యాన్ని ఇప్పటికే అధిగమించింది. ఈ మేరకు మంగళవారం తిరుపతిలో నిర్వహించిన సమావేశంలో కడప ఆర్‌జేడీ రామాంజనేయులు చేతులమీదుగా పలమనేరు ఏఎంసీ కార్యదర్శి సంజీవ్‌కుమార్ జ్ఞాపిక అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ పన్ను వసూళ్లలో టాప్‌లో నిలిచేందుకు సహకరించిన ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్లు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్



కో-ఆర్డినేటర్ సుబ్రమణ్యం

చిత్తూరు కలెక్టరేట్ : జేఈఈ మెయిన్స్‌ను బుధవారం నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పరీక్షల సిటీ కో-ఆర్డినేటర్ సుబ్రమణ్యం వెల్లడించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ చిత్తూరు సమీపంలోని సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయని వివరించారు. మొత్తం 1,500 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. అర్ధగంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి రావాలని సూచించారు. ఆలస్యంగా వస్తే అనుమతి ఉండదని స్పష్టం చేశారు. హాల్ టికెట్, ఆధార్, అడ్మిట్ కార్డులను తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు.

పకడ్బందీగా 'పాల్' తరగతులు



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సర్కారు బడుల్లో పాల్ (పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్) తరగతులను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ విజయేంద్రరావు ఆదేశించారు. మంగళవారం ప్రధానోపాధ్యాయులతో ఆయన సమీక్షించారు. డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు పాల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నోడల్ ఆఫీసర్ కిషోర్ మాట్లాడుతూ గణితం అభివృద్ధి కోసం విద్యార్థులు పాల్ ట్యాబ్ వినియోగించాలన్నారు. ఈ మేరకు హెచ్‌ఎంలు ప్రోత్సహించాలని సూచించారు. వారానికి ఒక తరగతిని పాల్ ట్యాబ్ వినియోగానికి కేటాయించాలని ఆదేశించారు. సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 64 పాఠశాలల్లో పాల్ కార్యక్రమం అమలవుతోందన్నారు. సమీక్షలో జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ హేమారెడ్డి, సమగ్ర శిక్ష శాఖ సెక్టోరల్ ఆఫీసర్ జయప్రకాష్ పాల్గొన్నారు.

నేడు తిరుపతికి సీఎం వైఎస్ జగన్

- ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌కు హాజరుకానున్న ముఖ్యమంత్రి
- పటిష్ట ఏర్పాట్లు చేపట్టిన యంత్రాంగం





రేణిగుంట విమానాశ్రయంలో మాట్లాడుతున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

రేణిగుంట/తిరుపతి అర్బన్: తిరుపతి పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విచ్చేయనున్నట్లు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. చిన్నపాటి లోపాలు లేకుండా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి, జేసీ శుభం భవల్స్‌లో కలసి మంగళవారం రేణిగుంట విమానాశ్రయంలో ఏఎస్‌ఎల్(ముందస్తు భద్రత లైజన్) సమావేశాన్ని సంబంధిత అధికారులతో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తిరుపతి తాజ్ హోటల్‌లో నిర్వహించే ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో పాల్గొంటారన్నారు. సాయంత్రం 4.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గాన 4.30 గంటలకు తాజ్ హోటల్‌కు చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమానంతరం అక్కడి నుంచి బయల్దేరి సాయంత్రం 5.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని తిరుగు ప్రయాణం కానున్నట్లు ఆయన వివరించారు. సీఎం పర్యటన సందర్భంగా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ పటిష్టమైన బందోబస్తు ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు నిశాంత్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, ఎయిర్‌పోర్ట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, ఏఎస్పీ విమలకుమారి, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజారఘువీర్, పౌరసరఫరాల శాఖ మేనేజర్ సుమతి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, ఇన్‌స్పెక్టర్ రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

ట్రయల్ రన్ సక్సెస్



విజయవంతంగా నిర్వహించిన ట్రయల్ రన్, ఏఎస్‌ఎల్

తిరుపతి క్రైం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పర్యటించనున్న ప్రాంతాలలో నిర్వహించిన ట్రయల్ రన్ సక్సెస్ అయినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం జరగబోయే ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వస్తున్న ముఖ్యమంత్రి కి భద్రతలో భాగంగా నిర్వహిస్తున్న ఏఎస్‌ఎల్, కాన్వాయ్ ట్రైల్ రన్ మంగళవారం విజయవంతంగా నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు.




మహిళల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం

పుత్తూరు: మహిళల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. మంగళవారం వడమాలపేటలో స్విమ్స్ ఆస్పత్రి వారు నిర్వహిస్తున్న పింక్ బస్ 150వ క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగాలు, చిన్న పాటి వ్యాపారాలతో పాటు కుటుంబ వ్యవహారాలను చూసుకునే మహిళలు తమ ఆరోగ్యం గురించి పట్టించుకోరన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని వెల్లడించారు. అందులో భాగంగానే పింక్ బస్ ద్వారా ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల వద్దకే వచ్చి సేవలందిస్తున్న పింక్ బస్ ద్వారా 40 ఏళ్ల నిండిన మహిళలకు గర్భాశయం, రొమ్ము, నోటి క్యాన్సర్‌కు సంబంధించిన వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారని వివరించారు. రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చయ్యే క్యానర్ నిర్ధారణ పరీక్షలను ది ప్రభుత్వం ఉచితంగా చేయిస్తోందని తెలిపారు. గ్రామీణ మహిళలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పింక్ బస్ తొలి వైద్య శిబిరాన్ని నగరి నియోజకవర్గంలోనే ప్రారంభించినట్లు గుర్తు చేశారు. అలాగే 100 శిబిరాన్ని వడమాలపేట మండలం టీసీ అగ్రహారంలోనూ. ఇప్పుడు 150వ క్యాంపును సైతం ఇక్కడే ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటి వరకు మొత్తం 14 పింక్ బస్ శిబిరాలు నిర్వహించినట్లు వివరించారు. భవిష్యత్‌లో రెండు బస్సులతో క్యాంపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

మండలంలోని 748 కుటుంబాలకు స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను మంత్రి రోజా పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రూ.5 లక్షల ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్, నేతలు సుబ్రమణ్యంరెడ్డి, యాదవేంద్రరెడ్డి, కరుణాకర్‌చౌదరి, సురేష్‌రాజు, నందయ్య, చైతన్య, లోకేష్‌రెడ్డి, చంద్రారెడ్డి, మునిబాబు, రాజశేఖర్, రాజేంద్ర, దొరస్వామి పాల్గొన్నారు.





పలమనేరు.. ప్రగతి పరుగులు

ఒకప్పుడు అన్ని రంగాల్లో వెనుకబడిన పలమనేరు నియోజకవర్గం.. ఇప్పుడు ప్రగతి పథంలో పరుగులు తీస్తోంది. నాడు అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిన ప్రాంతం.. నేడు మారిన రూపురేఖలతో అబ్బురపరుస్తోంది.. గతంలో శిథిలావస్థకు చేరిన సర్కారు బడులు.. ప్రస్తుతం కార్పొరేట్ హంగులతో అలరారుతున్నాయి. కనీస సౌకర్యాలు కూడా లేని ప్రభుత్వాస్పత్రులు.. ఆధునిక పరికరాలతో వైద్యసేవలందిస్తున్నాయి. సచివాలయాల ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే సకల సేవలు చేరుతున్నాయి. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. ఆర్‌బీకేలు.. విలేజ్ క్లినిక్‌లు.. పాలవెల్లువ కేంద్రాలతో పల్లె సీమలు కళకళలాడుతున్నాయి.. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ సుపరిపాలనపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- మారిన పట్టణం.. గ్రామాల రూపురేఖలు
- అబ్బురపరుస్తున్న అభివృద్ధి పనులు
- ఆధునిక వసతులతో సర్కారు బడులు.. ఆస్పత్రులు
- ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు
- అర్హులందరికీ అందుతున్న సంక్షేమ ఫలాలు



పలమనేరు : వైఎస్సార్‌సీపీ పాలనలో పలమనేరు నియోజకవర్గం ఎంతో మారింది. గత టీడీపీ హయాంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ప్రస్తుతం అమలవుతున్న అభివృద్ధి.. సంక్షేమ పథకాలకు తేడాను ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలకు అన్నదాతలు సంబరపడుతున్నారు. నాడు-నేడు కింద అత్యాధునికంగా తయారైన ప్రభుత్వ పాఠశాలలను చూసి విద్యార్థులు, తల్లిదండ్రులు ఉప్పొంగిపోతున్నారు. సచివాలయాల్లో అందుబాటులోకి వచ్చిన పౌరసేవలపై అన్నివర్గాల వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సర్కారు ఆస్పత్రుల్లో అందిస్తున్న అత్యాధునిక వైద్యసేవలపై రోగులు సంతోషపడుతున్నారు. నూతనంగా నిర్మించిన రోడ్లు, పాడి పరిశ్రమకు ప్రోత్సాహంగా ఏర్పాటు చేసిన జగనన్న పాలవెల్లువ సెంటర్లు, క్షేత్రస్థాయిలో చికిత్సలందిస్తున్న డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లపై హర్షం వెలిబుచ్చుతున్నారు. జగనన్న పాలనలో పలమనేరు నియోజకవర్గ పురోగతిని నిశితంగా పరిశీలించి ప్రశంసలు కురిపిస్తున్నారు.

ఆస్పత్రుల ఆధునికీకరణ



పలమనేరులోని వందపడకల ఆస్పత్రి

పలమనేరు ఏరియా ఆస్పత్రిని రూ.17కోట్లతో ఆధునికీకరించారు. నూతన భవనాలు నిర్మించారు. అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. పట్టణంలోని గంటావూరు, ఎద్దులసంత వీధుల్లో రూ.1.60 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్లు, పెద్దపంజాణి, గంగవరం, రాయలపేట, వి.కోట, కొలమాసనపల్లె, తీర్థం, పత్తికొండ పీహెచ్‌సీల అభివృద్ధికి రూ.1.93 కోట్లు ఖర్చు పెట్టారు. అలాగే బైరెడ్డిపల్లెలో రూ.1.50 కోట్లు వెచ్చించి 24గంటలు సేవలందించే ఆస్పత్రి నిర్మించారు.

నూతన ఒర'బడి'



నాడునేడు ద్వారా మారిన బడి

నాడు-నేడు ఫేజ్-1 ద్వారా 113 బడులకు రూ.27.31కోట్లు వెచ్చించారు. ఫేజ్-2 ద్వారా 291 బడులకు రూ.118.06 కోట్లును ఖర్చుపెట్టారు. మొత్తం మీద 404 పాఠశాలలను రూ.145.37 కోట్లతో కార్పొరేట్‌స్థాయిలో తీర్చిదిద్దారు. ఇదివరకు నియోజకవర్గంలోని మొత్తం పాఠశాలల్లో 48,200 మంది విద్యార్థులుండేవారు. ఈ రెండేళ్లలో కొత్త అడ్మిషన్ల కారణంగా 3 వేలు పెరిగి విద్యార్థుల సంఖ్య 51వేలకు చేరింది.

అందుబాటులో సేవలు



గంటావూరు సచివాలయంలో పౌర సేవలు

సచివాలయాల ద్వారా 545 పౌరసేవలు అందుబాటులో ఉన్నాయి. అందదులో 400 దాకా ప్రజలకు గ్రామాల్లో సైతం అందుతున్నాయి. వలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే సర్టిఫికెట్లు చేరుతున్నాయి. అలాగే జగనన్నకు చెబుదాం కార్యక్రమం కింద క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించి మరీ సమస్యలను పరిష్కరిస్తున్నారు.

ఇళ్ల లెక్క పక్కా

గత టీడీపీ హయాంలో పంచాయతీకి నాలుగైదు పక్కా ఇళ్లు మాత్రమే మంజూరయ్యేవి. అవికూడా జన్మభూమి కమిటీలు లేదా టీడీపీ కార్యకర్తలకు మాత్రమే. అయితే వైఎస్సార్‌సీపీ పాలనలో నియోజకవర్గంలోని పేదలకు మొత్తం 13,307 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 9,180 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది.

సంబరంగా సాగు

రైతు భరోసా కేంద్రాల ద్వారా నియోజకవర్గంలోని సుమారు 60వేల మంది రైతులు మేలు పొందుతున్నారు. గంగవరం, బైరెడ్డిపల్లె మండలాల్లో రూ.11 కోట్లు వెచ్చించి రెండు ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు నిర్మించారు. వీటి ద్వారా 1,600 మంది రైతులకు లబ్ధి చేకూరింది. రూ.6.40 కోట్లతో 16 మల్టీపుల్ గోదాములు నిర్మించారు. అలాగే పలమనేరు మార్కెట్ కమిటీలో రూ.50లక్షలతో డాక్టర్ వైఎస్సార్ అగ్రి ల్యాబ్ అందుబాటులోకి తీసుకువచ్చారు. వ్యవసాయానికి నాణ్యమైన 9 గంటల విద్యుత్ అందించేందుకు రూ.144 కోట్లతో సబ్‌స్టేషన్లు నిర్మించారు.

కరువు తీరేలా కృష్ణా జలాలు



పతపత్తూరు వద్ద హంద్రీ-నీవాలో కృష్ణా జలాలు

గత టీడీపీ పాలనలో హంద్రీ-నీవా కాలువ ద్వారా పలమనేరు నియోజకవర్గానికి సాగు, తాగునీరందిస్తామని చంద్రబాబు హామీ గుప్పించారు. తన నైజానికి తగ్గట్టుగానే హామీని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారు. అయితే ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. ప్రస్తుతం కృష్ణా జలాలు పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి, గంగవరం, బైరెడ్డిపల్లె మండలాల్లో ప్రవహిస్తున్నాయి. భూగర్భజలాలు పెరిగి వేసవిలో సైతం నీటి ఎద్దడి ఉండదు. దీంతో ఈ ప్రాంతం సశ్యశ్యామలం కానుంది.



సచివాలయాలు, ఆర్‌బీకే భవనాలు



మండిపేట కోటూరుకు వేసిన తారురోడ్డు



పలమనేరులో వైఎస్సార్ అగ్రి ల్యాబ్



పత్తికొండ వద్ద ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్

గర్వంగా ఉంది



నేను టీచర్‌గా పనిచేసే సమయంలో పిల్లల కష్టాలు, సౌకర్యాలు లేని పాఠశాలలను చూసి ఎంతో బాధపడేవాడిని. పాలకులు పట్టించుకోకుంటే సేవాభావం ఉన్నవారిని సాయం చేయమని అడిగేవాడిని. అలాగే నా జీతంలో కొంత విద్యార్థుల కోసం ఖర్చుపెట్టేవాడిని. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కారణంగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. మా బడిని చూస్తే ఇప్పుడు గర్వంగా ఉంది. విద్యార్థులకు చక్కటి బోధన, వసతులు అందుబాటులోకి వచ్చాయి.

– పుష్పరాజ్, విశ్రాంత ఉపాధ్యాయుడు, పలమనేరు

ఆనందంగా ఉంది



పలమనేరు ఏరియా ఆస్పత్రి ముందు నుంచే మా గ్రామానికి పోవాలి. ఈ ఆస్పత్రి గతంలో ఎలా ఉండేదో నాకు తెలుసు. కనీస సౌకర్యాలు లేక రోగులు వరండాల్లో పడుకునేవారు. గదుల్లో సైతం ఫ్యాన్లు ఉండేది కావు. చివరకు తాగేందుకు కూడా నీరు ఉండేది కాదు. అయితే ఇప్పుడు మా ఆస్పత్రిని చూస్తే ఆనందంగా ఉంది. నూతన భవనాలు, ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

– రెడ్డెప్పరెడ్డి, టీఎస్ అగ్రహారం, పలమనేరు

మేలు మరువలేం



గతంలో వ్యవసాయం అంటే నానా అవస్థలు పడాల్సిందే. సకాలంలో ఎరువులు దొరికేవి కావు. నకిలీ విత్తనాలతో నష్టాలే మిగిలేవి. గిట్టుబాటు ధర దక్కేది కాదు. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నదాతల బతుకులు మారిపోయాయి. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఆర్‌బీకేల్లోనే ఇస్తున్నారు. అధికారులు మా పొలం వద్దకే వచ్చి సలహాలు అందిస్తున్నారు. జగనన్న మేలు ఎన్నటికీ మరువలేం.

– గోవిందురెడ్డి, రైతు, బేరుపల్లె

బతుకులు బాగుపడ్డాయి



నేను నిత్యం మార్కెట్‌లో ప్రజల మధ్య వ్యాపారం చేసుకొనేవాడిని. ఒకప్పుడు జనం దుకాణాలకు వచ్చి నూకలు కొనేవాళ్లు. ఎప్పుడో పండగ వస్తేనే మంచి ఆహారం తినేవాళ్లు. అయితే ఇప్పుడు దుకాణాల్లో నూకలు కనిపించవు. ప్రభుత్వ పథకాల ద్వారా నగదు ఇంటింటికీ చేరడంతో పేదల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. వారి బతుకులు బాగుపడ్డాయి. వారి జీవన ప్రమాణాలు పెరిగాయి. ప్రజలు సంతోషంగా ఉన్నారు. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతకు నిదర్శనం. – గేట్ బాబు, పలమనేరు

జగనన్న పుణ్యమే..



నాటి టీడీపీ పాలనకు నేటి వైఎస్సార్‌సీపీ పాలనకు జనం తేడా గమనించారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేశాం. పేదల అభ్యున్నతికి పథకాలు అందించాం. ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయి అంటే ముఖ్యమంత్రి జగనన్న పుణ్యమే. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి రూ.2,635 కోట్లు వెచ్చించాం. ఇంత పెద్ద మొత్తాన్ని గతంలో ఎవరూ ఖర్చు పెట్టలేదు.

– వెంకటేగౌడ, ఎమ్మెల్యే, పలమనేరు

క్లుప్తంగా

29 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనపై ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలోని కార్పొరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీఈఆర్సీ అధికారులు పాల్గొంటారన్నారు. ఉమ్మడి జిల్లాలోని విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయాల నుంచి వినియోగదారులు సమావేశంలో తమ అభిప్రాయాలు వ్యక్తం చేయవచ్చని సూచించారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 వరకు అభిప్రాయ సేకరణ జరుగుతుందని వెల్లడించారు.

విద్యాసంస్థల్లో 'మాక్ పోల్'

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని సర్కారు బడులు, కళాశాలల్లో మంగళవారం మాక్ పోల్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఓటు వేసే విధానం, ఎన్నికల నిర్వహణ అంశాలపై అవగాహన కల్పించారు. డీఈఓ విజయేంద్రరావు, ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్‌మౌలా పర్యవేక్షించారు.

ట్రాన్స్‌కో జిల్లా స్టోర్ పరిశీలన

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా స్టోర్‌ను ఎస్‌ఈ కృష్ణారెడ్డి మంగళవారం పరిశీలించారు. మొత్తం 8 డివిజన్లకు సంబంధించి రోజు పంపుతున్న విద్యుత్ పరికరాల వివరాలను తెలుసుకున్నారు. వర్క్ ఆర్డర్ల మేరకు కావాల్సిన మెటీరియల్‌పై స్టోర్ డీఈ జయప్రకాష్‌ను ఆరా తీశారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఈఈలు శ్రీనివాసమూర్తి, పద్మనాభపిళ్లై, డీఈఈలు శేషాద్రి, ఆనంద్, ఏఈ వివేకానందరెడ్డి పాల్గొన్నారు.

విజయవంతంగా హెల్త్ క్యాంపులు

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం 23 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులను విజయవంతంగా నిర్వహించారు. మొత్తం 23 మంది పీహెచ్‌సీ డాక్టర్లు, 42 మంది ప్రత్యేక వైద్యులు కలిసి 8,298 మందికి చికిత్సలందించారు. జనరల్ ఓపీకి 3,954 మంది, గైనిక్‌కు 710, చిన్నపిల్లల సేవలకు 338, ఆర్థోకు 1,401, డెంటల్ 231, చర్మం 251, కంటి సమస్యలు 996, ఇతర సేవలకు 447 మంది రోగులు వైద్యసేవలు పొందారు. కంటి వెలుగు కింద 362 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

ప్రభుత్వ బళ్లు.. సౌకర్యాల పొదరిళ్లు

యాదమరి మండలం పెరుమాళ్ల పెంట గ్రామంలో జగనన్న గోరు ముద్దకు సంబంధించిన వివరాల బోర్డు



ప్రభుత్వ పాఠశాలలు చదువుల్లోనే కాదు.. సౌకర్యాల్లోనూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన సర్కారు స్కూళ్లు నూతన శోభను సంతరించుకున్నాయి. ఉచిత విద్య..ఆంగ్ల మాధ్యమం..పోషక విలువలు కలిగిన మధ్యాహ్నభోజనం.. డిజిటల్ తరగతులు.. ఇలా అన్ని అత్యుత్తమ సౌకర్యాల కల్పనతో పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఫలితంగా పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందుతోంది.

- నాడు- నేడుతో మారిన రూపు రేఖలు
- కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలలు
- సకల సౌకర్యాలు కల్పిస్తున్న జగనన్న ప్రభుత్వం
- ప్రభుత్వ పాఠశాలలకు క్యూ కడుతున్న విద్యార్థులు

పూతలపట్టు ఉన్నత పాఠశాల



నాడు - నేడు పథకంలో రూపు రేఖలు మారిన పూతలపట్టు ఉన్నత పాఠశాల



యాదమరి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. పలు పథకాలు అమలు చేసింది. ఫలితంగా పేదలకు ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో విద్యాబోధన సాగుతోంది. పూతలపట్టు నియోజక వర్గంలో పూతలపట్టు, యాదమరి, బంగారుపాళెం, తవణంపల్లె, ఐరాల మండలాలున్నాయి. ఈ ఐదు మండలాల్లో ప్రాథమిక పాఠశాలలు 301, ప్రాథమికోన్నత 28, ఉన్నత పాఠశాలలు 41 మొత్తం 380 పాఠశాలలున్నాయి. మొదటి విడత నాడు- నేడు పథకంలో 121 పాఠశాలల పునర్నిర్మాణ పనులకు రూ.23.21 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో



కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం వెస్ట్రన్ టాయిలెట్





పూతలపట్టు ప్రాథమిక పాఠశాలలో తాగునీటి కొళాయిలు (నాడు), విద్యార్థులు చేతులు కడుక్కోవడానికి ఏర్పాటు చేసిన కొళాయిలు(నేడు)

పాఠశాలలను ఆధునీకీకరించారు. అలాగే రెండో విడతలో 99 పాఠశాలలకు రూ.29.73 కోట్లు మంజూరయ్యాయి. 84 పాఠశాలలో పనులు పూర్తి కాగా మిగిలిన 15 పాఠశాలలో పనులు తుదిదశలో ఉన్నాయి. మూడో విడతలో మిగిలిన పాఠశాలలను మరమ్మతులు, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం రూ.16 కోట్ల నిధులు మంజూరు చేసింది. రెండు దశల్లో బాల బాలికలకు వేర్వేరుగా 406 మరుగుదొడ్లు నిర్మించారు. 202 పాఠశాలల్లోని ప్రహరీలకు రంగులు వేశారు. చేతులు శుభ్రం చేసుకోవడానికి 1,015 ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. తాగునీటి కోసం 404 ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. 202 పాఠశాలలకు 2,262 డెస్కులు అందజేశారు. 80 అదనపు గదులు నిర్మించారు. 202 వంట గదులు నిర్మించారు.

పెరిగిన విద్యార్థుల సంఖ్య

టీడీపీ ప్రభుత్వంలో కార్పొరేట్ పాఠశాలలను అభివృద్ధి చేసుకోవడానికి సర్కారు బడులపై శీతకన్ను వేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేక వెల వెల పోయారు. సర్కారు బడుల్లో గత ప్రభుత్వంలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో తమ పిల్లలను బాగా చదివించుకోవాలని అప్పులు చేసి, మరీ కార్పొరేట్ పాఠశాలలకు పంపారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత సర్కారు బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు ఇంగ్లీష్ మీడియం కూడ ప్రవేశపెట్టడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో నియోజక వర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో 9,438 మంది మాత్రమే ఉండగా ప్రస్తుతం సర్కారు బడుల్లో 12 వేల మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. అలాగే మండలానికి ఒక ఉన్నత పాఠశాలలో బాలికలకు జూనియస్ కళాశాలలు ఏర్పాటు చేయడంతో విద్యార్థుల తల్లి దండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



యాదమరి మండలం పెరుమాళ్ల పెంట ప్రాథమిక పాఠశాల స్వాగత ద్వారం

ఎలాంటి పుస్తకాలు కొనడం లేదు



నా పేరు ప్రియాంక. మాది ఐరాల మండలం కోనగుంట దళితవాడ. నాకు ఇద్దరు పిల్లలు. కుమారుడు పదో తరగతి, పాప ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఇద్దరినీ ప్రభుత్వ పాఠశాలకే పంపుతున్నాను. పాఠశాల ప్రారంభించిన రోజు మా పిల్లలకు టీచర్లు ఉచితంగా పుస్తకాలు, బ్యాగు, బూట్లు, యూనిఫామ్ అన్ని అందజేశారు. దీంతో బయట ఎలాంటి పుస్తకాలు కొనాల్సిన అవసరం లేకుండాపోయింది. జగనన్నకు చాలా రుణపడి ఉంటాం.

-ప్రియాంక, విద్యార్థుల తల్లి, ఐరాల మండలం

బాగా చదువుకుంటున్నారు.



పిల్లలు ఇప్పుడు ఇంటి వద్ద బాగా చదువుకుంటున్నారు. గతంలో వారు చదువుకోవడానికి పుస్తకాలు లేక, పాఠాలు చెప్పడానికి ఉపాధ్యాయులు సక్రమంగా లేక చదువుకునేవారు కాదు. కానీ ఇప్పుడు ప్రభుత్వం అన్ని పుస్తకాలు అందిస్తోంది. ప్రతి సబ్జెక్టుకు ఉపాధ్యాయులు ఉన్నారు. అలాగే టీచర్లు పిల్లలతో స్నేహితుల్లా ఉంటూ పాఠాలు చెపుతుండడంతో పిల్లలు బాగ అర్థం చేసుకుని, బాగా చదువుకుంటున్నారు.

-ఈశ్వర్‌రెడ్డి, విద్యార్థుల తండ్రి, పోలవరం, పూతలపట్టు మండలం

ఇంగ్లీష్ బాగా నేర్పిస్తున్నారు.



పాఠశాలలో ఇంగ్లీష్ బాగా చెప్పిస్తున్నారు. గతంలో ఇంగ్లీష్ చెప్పేవారు లేరు. గ్రామర్ నేర్చుకోవాలంటే పుస్తకాలు లేక, అర్థంకాక చాల ఇబ్బది పడ్డాం. కానీ ఇప్పుడు పుస్తకాలున్నాయి. ఉపాధ్యాయులు అర్థమయ్యేలా చెబుతున్నారు. ఇంగ్లీష్ బాగా అర్థం చేసుకుంటున్నాం. మాట్లాడుతున్నాం. కళాశాలలకు వెళ్లిన, బయటకు వెళ్లినా ఇంగ్లీష్ గురించి ఇప్పుడు ఇబ్బందులు లేవు.

-జస్వంత్, తొమ్మిదో తరగతి, పోలవరం ఉన్నత పాఠశాల, పూతలపట్టు మండలం

జూనియర్ కళాశాలల ఏర్పాటు సంతోషం



పదో తరగతి కాగానే బాలికల కోసం మండలానికి ఒక బాలికల జూనియర్ కళాశాలను జగనన్న ప్రభుత్వం ఏర్పాటు చేయడం చాల సంతోషం. మారు మూల గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లడానికి బస్సు సౌకర్యం తక్కువగా ఉండడంతో కళాశాలకు వెళ్లడానికి చాల ఇబ్బంది పడేవాళ్లం. కానీ మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంతో అందులో చేరుతున్నాం. అంతేగాక ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తుండడంతో చాల సంతోషంగా ఉంది.

-ఉదయ శ్రీ , బంగారుపాళెం మండలం

ఉదయాన్నే ప్రత్యేక తరగతులు



పదోతరగతి విద్యార్థులకు ఉదయాన్నే ప్రత్యేక తరగతులు పెడుతుండడంతో మరింత బాగా చదువుకుంటున్నాం. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో ఉపాధ్యాయులు మాములు తరగతులు కాకుండా ప్రత్యేక తరగతులు నిర్వహించి, ప్రతి విద్యార్థితో మాట్లాడుతూ అర్థం కాని పాఠాలను మరోసారి చెబుతున్నారు. దీంతో పాఠ్యాంశాలు బాగా అర్థం అవుతున్నాయి. ఈ సారి పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తాం.

-శృతి, పదోతరగతి విద్యార్థి, కాశిరాళ్ల ఉన్నత పాఠశాల, యాదమరి మండలం

అన్ని ఉచితమే



పదో తరగతికి వచ్చావు, ఈ సారి ఎన్ని పుస్తకాలు కొనాలో అని మా నాన్న ఆవేదన చెందారు. కానీ పాఠశాల ప్రారంభం రోజే మాకు అన్ని పుస్తకాలు, పెన్నులు, పుస్తకాలు భద్రపరచుకోవగానికి బ్యాగు ఇచ్చారు. ఇవన్ని మా నాన్నకు చూపించగానే చాలా సంతోష పడ్డారు. పుస్తకాలు ఉచితంగా తీసుకోవడం కాదు.. బాగా చదువుకోవాలని కోరారు. బాగా చదువుకుంటున్నాను.

-భానుప్రకాష్ రెడ్డి, కాశిరాళ్ల ఉన్నత పాఠశాల యాదమరి మండలం

అభివృద్ధి బడ్జెట్ రూ.4,732 కోట్లు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు , వేదికపై ఎంపీ రెడ్డెప్ప, జేసీ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా అభివృద్ధికి రూ.4732 కోట్ల బడ్జెట్ ప్రతిపాదించినట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం చిత్తూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం , ప్రభుత్వ పథకాల అమలులో జిల్లాను ముందంజలో ఉంచాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యస్తున్నట్లు వెల్లడించారు. 2024-25కు సంబంధించి రూ.4,732 కోట్ల ప్రతిపాదిత జెడ్పీ బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారని తెలిపారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని వివరించారు. సమావేశంలోజేసీ శ్రీనివాసులు, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్లు ధనంజయరెడ్డి, రమ్య, జెడ్పీ మహిళ స్థాయీ సంఘం చైర్‌పర్సన్ భారతి, ఈడిగ కార్పొరేషన్ చైర్మన్ శాంతి, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్‌కుమార్, జలవనరులశాఖ ఎస్‌ఈ విజయ్‌కుమార్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్, మురళీమోహన్, డ్వామా పీడీ గంగాభవాని, డీఈఓ విజయేంద్రరావు, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి రాజ్యలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌రెడ్డి, డీఐఓ రవిరాజు, ఐసీడీఎస్ పీడీ నాగశైలజా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ శ్రేణులు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం : మండలంలోని 64 పెద్దూరు పంచాయతీ సోమాపురానికి చెందిన 12 కుటుంబాల టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీలో చేరాయి. మంగళవారం ఈ మేరకు ఎమ్మెల్సీ భరత్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో మునిరాజు, ఏ.మునెప్ప, మునెప్ప, కోమలమ్మ, రాజేష్, మునివెంకటప్ప, కళమ్మ, నరసింహులు, కామాక్షి తదితరులు ఉన్నారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతోపార్టీలో చేరినట్లు చెప్పారు. సర్పంచ్ రాధాకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు యువరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నేత మృతి

పూతలపట్టు: మండలంలోని వేపనపల్లెలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నేత మృతి చెందారు. వివరాలు.. గ్రామానికి చెందిన మునిరామయ్య(71) గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరయ్యారు. తిరిగి ఇంటికి వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌తో ఢీకొన్నాడు. క్షతగాత్రుడిని చిత్తూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదగాళ్ల సొమ్ము లూటీ..?

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో జూదం ఆడుతున్న ఓ ముఠా నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.15 లక్షలు లూటీ చేసినట్లు తెలిసింది. సోమవారం రాత్రి రెండు గ్రూపులు చిత్తూరు- బెంగళూరు జాతీయ రహదారి పక్కన జూదం ఆడుతున్నారు. రాత్రి 11 గంటల సమయంలో నగదు గెలుచుకున్న ఓ ముఠా నుంచి, మరో గ్రూపు రూ.15 లక్షల దోచుకున్నట్లు సమాచారం. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి బాధిత వ్యక్తి వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. అయితే విషయం కాస్త పోలీసులకు చేరడంతో వార ఆరా తీస్తున్నారు.

అతివల ఆర్థికాభివృద్ధికి 'ఆసరా'



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్యే ఆరణి, మేయర్ అముద

- 33,655 గ్రూపులకు లబ్ధి
- 3,10,643 మంది ఖాతాల్లో రూ.324 కోట్లు జమ

చిత్తూరు కలెక్టరేట్ : మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేస్తున్నారని ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైఎస్సార్ ఆసరా పథకం జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల సమయలో ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి నెరవేర్చారని, అలాగే ఆసరా పథకం కింద మహిళా సంఘాలకు నాలుగు విడతలుగా ఆర్థిక సాయం అందించారన్నారు. గతంలో చంద్రబాబు హామీలు గుప్పించి ప్రజలను ఏమార్చేవారని ఆరోపించారు. కేవలం ఓట్ల కోసమే మాయ మాటలు చెప్పేవారని విమర్శించారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో మహిళలు వారి జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. జిల్లాలో నాలుగో విడత కింద 33,655 గ్రూపుల్లోని 3,10,643 మంది మహిళల ఖాతాల్లో రూ.324 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు నగర మేయర్ అముద, జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్, డీఆర్‌డీఏ పీడీ తులసి పాల్గొన్నారు.

పక్కాగా అసైన్డ్ పట్టాల పంపిణీ



జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడూతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద లబ్ధిదారులకు పకడ్బందీగా రిజిస్ట్రేషన్ చేయించాలని స్పష్టం చేశారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 9వ తేదీలోపు మొత్తం ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు క్షేత్ర స్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమీక్షలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

కన్నీటి సంద్రంగా మనియాణంపల్లె



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు, గ్రామస్తులు

పెనుమూరు (కార్వేటినగరం) : మండలంలోని మనియాణంపల్లె కన్నీటి సంద్రంగా మారిపోయింది. ఆదివారం పాండిచ్చేరి బీచ్‌లో సముద్రంలో మునిగిపోయి మరణించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జీవన్ చౌదరి మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరుకుంది. కుటుంబీకులతో కలిసి విహారయాత్రకు వెళితే విషాద ఘటన చోటుచేసుకుందని బంధువులు, గ్రామస్తులు విలపించారు. పుట్టినరోజు వేడుక జరుపుకోవాలని వెళ్లి అనంతలోకాలకు వెళ్లిపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు.

వివాహిత ఆత్మహత్య



నీలవేణి మృతదేహం

చౌడేపల్లె : మండలంలోని చారాల కురప్పల్లెలో మంగళవారం ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. గ్రామానికి చెందిన గిరి, తన భార్య నీలవేణి (45)తో కలిసి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వేకువ జామున భార్యాభర్తలిద్దరూ ఘర్షణ పడ్డారు. మనస్తాపం చెందిన నీలవేణి పురుగుల మందు తాగేసింది. అపస్మార స్థితికి చేరుకున్న ఆమెను స్థానికులు 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మరణించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వాసు తెలిపారు.